తెల్లవారక ముందే మద్యం అమ్మకాలు

- బార్ల ఎదుట మందు బాబులు క్యూ
- వైన్స్ షాపులకు అనధికార రూములు
- చోద్యం చూస్తున్న పోలీసు, ఎక్సైజ్ శాఖ



చేపల మార్కెట్ వద్ద మేడపైకి వెళ్లే దారిలో మద్యం అమ్మేందుకు ఏర్పాటుచేసిన అడ్డదారి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్లు వేళాపాళా లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్నాయి. స్టేషన్ పరిధిలో మొత్తం పదికి పైగా బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, దాదాపు అన్ని బార్లు తెల్లవారుజామున ఆరు గంటల నుంచే అమ్మకాలు ప్రారంభిస్తున్నాయి. బార్ మెయిన్ షట్టర్ మూసి ఉండగా , పక్కనే చిన్న గుమ్మం ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, కూలీలు, చిన్న చిన్న పనులు చేసుకునే వారే లక్ష్యంగా తెల్లవారుజామున మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రైల్వే స్టేషన్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, చేపల మార్కెట్, కేటీరోడ్డు, సొరంగం రోడ్డు, పాముల కాల్వ ప్రాంతాల్లోని బార్లు సూరీడితో పోటీ పడి బార్లు తెరుస్తున్నారు. స్టేషన్ పరిధిలోని బార్లు విచ్చలవిడిపై పోలీసులకు ఫిర్యాదులందినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నది లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామున మద్యం సేవించి డ్రెయిన్లలో పడి మృతి చెందిన ఘటనలు ఇటీవల కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్నాయి. అయితే ఈ ఘటనలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు ప్రమాదాలకు కారణమైన మద్యం అమ్మకాలు జరిపే బార్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మిలియన్ డాలర్ల ప్రశ్న. కొద్ది నెలల కిందట పాముల కాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలించారు. అయితే ఉదయం 9 గంటల సమయంలో జరిగిన ప్రమాదం పుటేజీలో బార్‌ను అప్పటికే తెరిచి అమ్మకాలు జరుపుతున్నట్టు రికార్డు అయినా ఎటువంటి చర్యలు లేవు.

కన్నెత్తి చూడని పోలీసు, ఎక్సైజ్ శాఖ....

సాధారణంగా నగరంలోని బార్లు ఉదయం 10 గంటలకు తీసి రాత్రి 11 గంటల వరకు మద్యం అమ్మకాలు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇక వైన్స్ షాపులు రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు చేసుకోవచ్చు. అయితే ఇందుకు విరుద్ధంగా బార్లు రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు చేస్తున్నాయి. ఉదయం 10 గంటలకు తెరవాల్సిన బార్లు తెల్లవారుజామున 6 గంటల నుంచే మద్యం అమ్మకాలు జరుపుతున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా రోడ్డుపై చిన్న టిఫిన్ బండి నిర్వాహకులు రాత్రి 10 గంటలు దాటితే లాఠీ ఝుళిపించే పోలీసులు బార్ల వైపు కన్నెత్తి చూడటం లేదని ఫిర్యాదులొస్తున్నాయి. మరో వైపు బార్లు, వైన్స్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేయడంపై ఇటీవల ఓ పార్టీకి చెందిన నేత ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆ పార్టీ సీనియర్ నాయకులకు సమాచారం అందించారు. అంతే కాకుండా బార్ యజమానులకు ఫోన్ చేసి కొన్ని రోజులు అమ్మకాలు నిలిపివేయాలని సూచించారు.

తలనొప్పిగా అనధికార రూములు

వైన్స్ షాపులకు అనధికార రూములు తలనొప్పిగా మారాయి. అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పైపుల రోడ్డు వద్ద ఇటీవల వైన్స్ షాపులో యువకులు వీరంగం సృష్టించి కత్తులతో రోడ్డుపై పరుగులు పెట్టారు. అయితే ఈ విషయాన్ని స్థానికులు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఒకే ఒక రోజు అనధికార పర్మిట్ రూమ్‌కు తాళం వేయించారు. రెండో రోజు వైన్స్‌కు కుడి వైపున ఉన్న డోర్ ఎడమ వైపునకు మారిందంతే. ఇక వైవి.రావు రింగ్ వద్ద ఉన్న మరో వైన్స్ షాపు తాజాగా కొద్ది రోజుల కిందట అనధికార రూమ్‌ను ఓపెన్ చేశారు. దీనిపై సెక్టార్ ఎస్‌ఐని ప్రశ్నించగా అసలు అటువంటి రూమ్‌లను అంగీకరించమని చెబుతున్నారే తప్ప వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంది లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



రైల్వేస్టేషన్ వెస్ట్ బుకింగ్ సమీపంలో ఓ బార్ వద్ద మద్యం కోసం జనం



నెహ్రూబొమ్మ సెంటర్‌లో మద్యం అమ్మకాలు చేపట్టే సందు

ఏఐతో విప్లవాత్మక ప్రగతి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): అధునాతన సాంకేతిక వ్యవస్థలో జనరేటివ్ ఏఐతో విప్లవాత్మకమైన ప్రగతిని సాధించనున్నట్లు టీసీఎస్ (హైదరాబాద్) టాలెంట్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి జేవీఆర్‌ఎస్ ప్రసాద్ అన్నారు. కేబీఎన్ కళాశాల, కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఏఐపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు అందించే వివిధ రకాల ఇన్‌పుట్‌ల ఆధారంగా కొత్త కంటెంట్‌ను త్వరగా రూపొందించడానికి జనరేటివ్ ఏఐ వీలు కల్పిస్తుందన్నారు. సాంకేతిక పత్రాలను సులభంగా సమీక్షించడంలో, నూతన ఆవిష్కరణలను ప్రతిపాదించడంలో సహాయపడుతుందని చెప్పారు. వైద్య నివేదికల విశ్లేషణ, వ్యాధి గుర్తింపు, చికిత్సా ప్రతిపాదనలు చేయటానికి జనరేటివ్ ఏఐ పరిజ్ఞానం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ ఏఐ ఆధారిత మార్పులను నిరంతరం అవగాహన చేసుకుంటేనే టెక్నాలజీ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవటం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి వైస్ ప్రిన్సిపల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, కంప్యూటర్ విభాగాధిపతి పి.రవీంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేవీఆర్‌ఎస్ ప్రసాద్

నర్సింగ్ సిబ్బంది సేవలు ఎనలేనివి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అస్వస్థతతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు నర్సింగ్ సిబ్బంది అందించే సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. అంతర్జాతీయ నర్సింగ్ డేను పురస్కరించుకుని గుణదలలోని కొత్త ప్రభుత్వాస్పత్రిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) ఉమ్మడి కృష్ణా అధ్యక్షుడు వినుకొల్లు రామకృష్ణ మాట్లాడుతూ రోగుల ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకమన్నారు. వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. నర్సులు అందిస్తున్న అనురాగ పూరిత సేవల కారణంగా అనేక కుటుంబాలు ఆరోగ్యంగా జీవిస్తున్నాయని చెప్పారు. మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణ నర్సింగ్ సిబ్బంది అన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా నర్సింగ్ సిబ్బందికి తమ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస సిటీ అధ్యక్షురాలు జలం సరోజిని, కార్యదర్శి బొమ్మగంటి రాంబాబు, ప్రసన్న, సమత, భార్గవి, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

- ఇంజినీరింగ్ అధికారులతో ఈవో సమావేశం
- సమీక్షకు బీజేపీ నేతలు హాజరు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై ఆలయ ఈవో శీనానాయక్ సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో నిర్వహించిన సమీక్షకు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో పాటు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు హాజరయ్యారు. ఈ సమావేశానికి బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ హాజరయ్యారు. ఆలయ మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్న ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్‌తో పాటు ఇతర అభివృద్ధి పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులు ఈవో శీనా నాయక్‌కు వివరించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో ఎమ్మెల్యే సూచన మేరకు చేపట్టిన మార్పుల గురించి తెలియజేశారు. మాస్టర్ ప్లాన్ వీడియోను ఈవో వీక్షించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి త్రీడి ప్రింట్‌ను సిద్ధం చేయడంతో పాటు ప్రతి నెలా పనుల పురోగతిపై నివేదక తయారు చేయాలని సూచించారు. సమీక్షలో ఇద్దరు బీజేపీ నేతలు పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, రిటైర్డ్ ఎస్ఈ ఉదయ్‌కుమార్, రిటైర్డ్ ఈఈ నారాయణమూర్తి, డీసీపీ చంద్రబోస్, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ పనులపై సమీక్షిస్తున్న ఈవో శీనానాయక్

నగరాభివృద్ధికి నిరంతర కృషి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం మేయర్ అధ్యక్షతన స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో 45 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 39 ఆమోదిస్తూ తీర్మానించారు. మూడు అంశాలు ర్యాటిఫై చేయగా ఒకటి పరిశీలించాలని, మరొక అంశాన్ని ధ్రువీకరణ చేయాలని ఇంకో అంశాన్ని రికార్డు చేశారు.

ప్రధానాంశాలు...

- వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించే భవనానికి మరొక లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ ప్రతిపాదనను ఆమోదిస్తూ సభ్యులు తీర్మానించారు.
- పటమట 11వ డివిజన్‌లో ఉన్న యలమంచిలి కుటుంబరావు పార్కులో వాకింగ్ ట్రాక్ పెంచాలని, పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయాలని ఇందుకు రూ. 30 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయింపులు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఖాళీగా ఉన్న 78 డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న వారికి ప్రమోషన్ ఇవ్వాలని వచ్చిన మెరిట్ జాబితాను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్-3 పరిధిలోని 17వ డివిజన్‌లో కృష్ణానది వరద నివారణకు నిర్మించిన ప్రహరీ వెంబడి నిర్మించిన రివర్‌ఫ్రంట్ పార్కు ఇటీవల వరదలకు దెబ్బతిన్నదని, వర్షాకాలంలో కోతకు గురవుతుందని, పార్కులో కాంక్రీట్ గోడ వెంబడి బలపరచేందుకు గ్రావెల్‌తో గోడ నిర్మించాలని అందుకు రూ. 49.85 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వైభవంగా శ్రీవారి గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో గరుడ వాహనోత్సవ సేవ సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని బ్రాహ్మణ వీధిలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గరుడ సేవ నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ఆలయంలో స్వామి వారిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం పౌర్ణమి రావటంతో స్వామి వారికి గరుడ వాహనోత్సవం చేశారు. అత్యంత రమణీయంగా అలంకరించిన గరుడవాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో, వేదవచనాలతో, భక్తుల నామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారిని ఊరేగించారు.

స్వామి వారికి వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం పంచామృత తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. పౌర్ణమి రోజున అభిషేకాన్ని నిర్వహించటం ఆనవాయితీ. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షితులు పూజలు నిర్వహించారు.


గరుడ వాహనంపై స్వామి ఊరేగింపు


స్వామి వారికి పంచామృత తిరుమంజనం

రైల్వే పెన్షన్ స్కీంలపై అవగాహన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీం), ఎన్‌పీఎస్ (న్యూ పెన్షన్ స్కీం), ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)లలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు మూడు మూడు రోజుల పాటు విజయవాడ డివిజన్‌లో ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అల్లం రమేష్ ఉద్యోగులకు సూచించారు. సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2004 తర్వాత విధి నిర్వహణలో వచ్చిన ఉద్యోగికి పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఆ స్థానంలో ఎన్‌పీఎస్, తరువాత దానిలో కొన్ని సవరణలు చేసి యూపీఎస్ విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వీటిలో ఏదైనా ఒక దానిని జూన్ నెలలోపు ఉద్యోగి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేసుకోకపోతే ఆ ఉద్యోగికి ఎన్‌పీఎస్ విధానం అంగికరించినట్లే అని తెలిపారు. ఈ మూడు పెన్షన్ విధానాల్లో ఉద్యోగుల్లో కొంత అస్పష్టత ఉందని పేర్కొన్నారు. వాటిని నివారించుకునేందుకు బుధవారం వరకు జరిగే ఈ సదస్సులో పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకోవాని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ సీ అండ్ డబ్ల్యూ బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, కార్యవర్గ సభ్యులు నవీన్, లాజరస్, మణికుమార్, బి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


రైల్వే కార్మికులకు పెన్షన్ విధానాలపై అవగాహన కల్పిస్తున్న రమేష్

ముగిసిన ఓపెన్ డబుల్స్ టెన్నిస్ టోర్నమెంట్

విజేతలకు ట్రోఫీల అందజేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేడియంలోని హ్యాంగింగ్ గార్డెన్ రైల్వే టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో జరిగిన 'బెజవాడ ఓపెన్ డబుల్స్ టెన్నిస్ టోర్నమెంట్' సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నీలో 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్, 60 ప్లస్ నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో రైల్వే ఉద్యోగులు, ఇతరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 50 ప్లస్ విభాగంలో జరిగిన డబుల్స్ పోటీలో గంజి వెంకటేశ్వరరావుతో పాటు విజయవాడ రైల్వే ఉద్యోగి ఎ.శ్రీనివాసరావు అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్ సాధించారు. 30 ప్లస్ విభాగంలో జగదీష్, అశోక్‌రెడ్డి, 40 ప్లస్ విభాగంలో కె.కోటేశ్వరరావు, తిరుమలరావు, 60 ప్లస్ విభాగంలో అన్నం వెంకటేశ్వర్లు, పాల్ మోహనరావు టైటిల్ సాధించి విజేతలుగా నిలిచారు. ముగింపు వేడుకల్లో పాల్గొన్న హ్యాంగింగ్ గార్డెన్ రైల్వే టెన్నిస్ క్లబ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్ర ప్రసాద్ విజేతలకు ట్రోఫీలను అందజేసి అభినందించారు.


టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్స్ సాధించిన విజేతలు

విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కలిసిన క్రీడాకారిణి చైత్ర దీపికను కమిషనర్ అభినందించారు. ఎన్ఎస్ఎం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న చైత్ర ఇటీవల తైవాన్‌లో జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలరు స్కేటింగ్ ఓపెన్ కాంపిటేషన్స్ భారత జట్టుకు పలు విభాగాల్లో ప్రాతినిధ్యం వహించింది. పెయిర్ స్కేటింగ్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్య పతకం, కపుల్ డాన్స్ విభాగంలో రజత పతకాలు సాధించింది. భారత దేశం తరుపున స్కేటింగ్‌లో ఆరు దేశాలకు (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, కొరియా, ఇటలీ, సింగపూర్) దీటైన పోటీ ఇచ్చి మూడు పతకాలు సాధించి దేశానికి ఎంతో పేరు తీసుకొంచింది. గతంలో చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలరు స్కేటింగ్ చాంపియన్‌షిప్ (వరల్డ్ స్కేటింగ్ అసోసియేషన్) లో కూడా భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించి పెయిర్ స్కేటింగ్ లో బంగారు పతకం సాధించింది. దక్షిణ కొరియాలో ఈ ఏడాది జూలై 20 నుంచి 30 తేదీ వరకు జరిగే 20వ ఏషియన్ రోలరు స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు చైత్ర దీపిక ఎంపికైనందుకు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


చైత్రదీపికను అభినందిస్తున్న కమిషనర్

సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా, సమర్ధవంతంగా పరిష్కరించడం నగర పాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని అధికారులకు సూచించారు. ఇందులో మొత్తం 13 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళికకు సంబంధించినవి-5, ఇంజినీరింగ్-2 , రెవెన్యూ-2, ప్రజారోగ్యం-3, పట్టణ సాధికార విభాగం-1 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎస్ఈ పి. సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.


నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

15న విద్యుత్ అదాలత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ టౌన్ డివిజన్‌లోని 16 సెక్షన్ల పరిధిలోగల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ ఆఫీస్ కార్యాలయంలోని రెండవ అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్న విద్యుత్ అదాలత్‌ను 16 సెక్షన్లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేసిన 43 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 43 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 43 మందిపై 6వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదుచేశారు. వీరిని రైల్వేకోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని పోలీసులు చెప్పారు.

క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి కామ్రేడ్ జీఆర్‌కే, రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం క్లాసికల్ చిత్రగీతాలు, హిందీ చిత్రగీతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీ గాయకులు రవికుమార్, శేఖర్, మోహన కృష్ణ, పెద్దిరెడ్డి, కోటి, మస్తాన్ వలీ, మోహనలక్ష్మి, నిషిత, ఉషారెడ్డి, దుర్గా నాగమణి తదితరులు పలు చిత్రగీతాలను ఆలపించారు. చిట్టిబాబు, కె. డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు.

శివయాదవ్‌కు నివాళి


బట్టిపాటి శివ యాదవ్ (ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఊర్మిళా నగర్‌కు చెందిన బట్టిపాటి శివ యాదవ్ (47) హఠాన్మరణంతో పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు సూర్యారావుపేటలోని ఒక ప్రైవేట్ హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య సంధ్యారాణి (ఏపీ సంగీత, సాహిత్య మాజీ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్), కుమారుడు మానస్, కుమార్తె స్నేహ ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో బట్టిపాటి శివ క్రియాశీలకంగా పనిచేశారు. శివ యాదవ్ మరణ వార్త తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంధ్యారాణి, పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆర్ఎస్‌సీ అభివృద్ధికి ప్రణాళికలు

అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ శరత్‌కుమార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురంలోని రీజనల్ సైన్స్ సెంటర్ (ఆర్ఎస్‌సీ) అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్ తెలిపారు. ఆర్ఎస్‌సీని ఆయన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదల కారణంగా సైన్స్ సెంటర్‌లోని ఎగ్జిబిట్స్ దెబ్బతిని కార్యకలాపాల నిర్వహణకు అంతరాయం కలిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో సైన్స్ సెంటర్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో వర్క్‌షాప్‌లు, విద్యా కార్యక్రమాలు, సైన్స్ ప్లానిటోరియం, గణిత విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే త్రీడీ థియేటర్, డిజిటల్ ప్లానిటోరియం, మ్యూజిక్ లైటింగ్‌తో కూడిన వాటర్ ఫౌంటెన్, యువతలో అంతరిక్షం పట్ల అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులతోపాటు సైన్స్ ఉపాధ్యాయులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

పదకవితకు పట్టాభిషేకం

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు 617వ జయంతి వేడుకలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం అన్నమాచార్యుల సంకీర్తనలు పాడుకుంటూ సంగీత విద్వాంసులు నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపం నుంచి ప్రారంభమైన శోభాయత్ర లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాయాలనికి చేరుకుంది. దారిపొడవునా అన్నమయ్యకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. సంగీతోత్సవంలో భాగంగా పోపూరి శ్యామసుందర్, అంజనాసుధాకర్, చింతలపాటి హరిత, లక్ష్మీజయతి, నాగపూజిత, కుందుల అనిల్‌కుమార్, పోపూరి షణ్ముఖ ప్రియ, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల విద్యార్థినులు, అనూష త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. 'శ్వాస' సభ్యులు సత్యబాలు, ప్రసాద్, దుగ్గిరాల శ్రీలత, హాస శ్రీమేధ నిర్వహించారు. దేవాలయంలోని అన్నమాచార్య విగ్రహానికి దేవాలయ మేనేజర్ శర్మ, నిర్వహణ బాధ్యులు డాక్టర్ సి. రామ్మోహనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.